

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## స్వర్ణాంధ్ర- 2047 విజన్ యాక్షన్ ప్లాన్‌ను సమర్ధవంతంగా అమలు చేయాలి : మంత్రి ఆనం



**నెల్లూరు,జూన్ 10, ప్రభాతవార్త-వైద్యం** ఆత్మకూరు నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ యాక్షన్ ప్లాన్‌ను సమర్ధవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో స్వర్ణాంధ్ర - 2047 విజన్ యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి మాట్లాడారు. శాఖల వారీగా సమీక్షించి చేపట్టాల్సిన కార్యచరణపై అధికారులకు దిశానిర్ధేశం చేశారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌యాక్షన్ ప్లాన్‌లో పొందు పరిచిన లక్ష్యాలను చేరుకునేందుకు పక్కా ప్రణాళికతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ పావని, చీఫ్ ప్లానింగ్ అధికారిరఘురామయ్య, ఆర్అండ్‌బి పంచాయతీ రాజ్, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## నెల్లూరుకు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాక



**నెల్లూరు రూరల్, జూన్ 10, ప్రభాతవార్త** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 12వ తేదీ నెల్లూరుకు రానున్నారు. అక్రమ మై నింగ్ కేసులో ఏ 4 ముద్దయిగా అరెస్టు అయిన మాజీ మంత్రి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్నారు. వారిని కలిసి ధైర్యం చెప్పేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నెల్లూరుకి రానున్నారు. వారి కుటుంబానికి వైయస్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా కల్పించేందుకు ఆయన రానున్నారు. వెంకటాచలంలో ఎలిఫెంట్ దిగేందుకు స్థలాన్ని పరిశీ లించిన ఎమ్మెల్సీ వైఎస్ఆర్సిపి సిటీ ఇంచార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అధినేత జగన్మోహన్‌రెడ్డికి సర్వం సిద్ధం చేస్తున్నారు.

# త్వరలో వీపీఆర్ నేత్ర ప్రారంభం

- జిల్లాలో ప్రజలందరికి కంటి వైద్య పరీక్షలు

- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

- దివ్యాంగులకు సేవ చేయటంలోనే సంతోషం ఉంది

- జిల్లాలో ఇప్పటి వరకు 950 మందికి ట్రై సైకిళ్ల అందజేత





**కోవూరు , జూన్ 10, ప్రభాతవార్త** దివ్యాంగులకు సేవ చేయడంలో తమకు ఎంతో సంతోషం ఉం టుందని కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో కోవూరు నియోజకవర్గానికి సంబంధించి 12 మంది దివ్యాంగులకు వీపీఆర్ ఫౌండేషన్ తరుపున ఎలక్ట్రిక్ ట్రై సైకిల్స్ అంద జేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో ఆమె ప్రత్యే కంగా ముచ్చటించారు. వారి యోగక్షేమాలు తెలు సుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 950 మంది దివ్యాంగులకు ట్రై సైకిల్స్ అందించామని, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆలోచనల నుంచి ఈ కార్యక్రమం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమం భవిష్య త్తులోనూ ఇలాగే కొనసాగుతుందని వెల్లడించారు. త్వరలోనే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారని చెప్పారు. వీపీఆర్ నేత్ర అన్న కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి ఒక్కరికి కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం ద్వారా తాను, అలాగే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎనలేని సంతోషాన్ని పొందుతున్నట్లు పేర్కొన్నారు. నడవలేని దివ్యాంగులకు ట్రై సైకిల్స్ ఎంతో ఉపయోగపడుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెముకుల కృష్ణచైతన్య, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశిరెడ్డి, ఆవుల వాసు, ఇతర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా రంగానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట

### సర్వేపల్లి టిడిపి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ముత్తుకూరు, జూన్ 10, ప్రభాత వార్త** క్రీడా రంగానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని సర్వేపల్లి టిడిపి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొ న్నారు. మండలంలోని దొరువుల పాల్యెం పంచాయితీలో మంగళవారం రెండు నెలల నుంచి జరుగుతున్న శ్రీ వెంకయ్య స్వామి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆయనతో పాటు సతీమణి శృతి రెడ్డి, కుమారుడు హాజరైయ్యారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదుపడతాయని పల్లెల్లో చెడువ్య సనాలకు తోను కాకుండా క్రీడా పోటీలపై మక్కువ చూపాలన్నారు. గెలుపు ఓటములు సహజంగా తీసు కోవాలని ఆయన అన్నారు. ఈ క్రికెట్ పోటీలను సర్వేపల్లి నియోజకవర్గంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తామని క్రీడాకారులకు సంబంధించిన క్రీడా సామాగ్రిని కల్పనకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజన కాలనీలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గిరిజనుల ఆధార్ కార్డుల కోసం నియో జకవర్గంలో ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారని గిరిజనులకు సంక్షేమ పథకాలు ఎందుకు అందడం లేదంటే వారికి ఆధార్, రేషన్ కార్డు లేకపోవడం కారణమని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టి ఈ రోజు గిరిజనుల కోసం పాటు పడుతున్నారన్నారు. ఎక్కడికి వెళ్లినా మా కుటుంబ సభ్యులు పైన ప్రజలు చూపుతున్న ఆప్యాయతను మరచిపోమన్నారు. క్రీడాకారులకు మొదటి బహుమతిని ప్రధానం చేసిన పంటపాలెం పంచాయితీలోని కోళ్లమిట్టకు చెందిన టిడిపి నాయకులు తిన్నెలపూడి సిద్ధయ్య ను ఆయన అభినందించారు. క్రికెట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులను కూడా అభినందించారు. ఈ కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, స్థానిక నాయకులు ఇసనాక చంద్రశేఖర్ రెడ్డి, మారెం విక్రమ రెడ్డి, త్రాగు నీటి సంఘం అధ్యక్షుడు మురళి రెడ్డి, గోపాల్ రెడ్డి, పేరినేటి రామ్మోహన్ రెడ్డి, ఈదురు రామోహ్మాన్ రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, పల్లంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, పల్లంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మావిడాల శ్రీనివాసులు, తిరుములశెట్టి సతీష్, ఎంపిపి నన్నం దీనయ్య, కాపులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన



**ఉదయగిరి, జూన్ 10 ప్రభాతవార్త** యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉదయగిరిలో నిర్వహించిన సామూహిక యోగా క్యాక్రమంలో పాల్గొన్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జిల్లా ఇన్‌ఛార్జీ కలెక్టర్ కార్తీక్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ, నోడల్ అధికారి, జిల్లా స్పోర్ట్స్ అధికారి యతిరాజు, డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుజాత, జడ్పీ సీఈఓ విద్యారమ, డ్వామా డీఆర్డీఏ పీడీలు గంగాభవాని, నాగరాజ కుమారి, పలువురు జిల్లా స్థాయి అధికారులు, యోగా అభ్యాసకులు, ఉదయగిరి పర్యాటక ప్రాంతంలో యోగా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం చాలా సంతోషకరం జూన్ 21 అం తర్జాతీయ యోగా దినోత్సవం రోజున జిల్లా వ్యాప్తంగా ప్రజలందరూ పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాల్లో పాల్గొన్నాలని ఎమ్మెల్యేకాకర్ల సురేష్‌అన్నారు. పర్యాటకంగా ఉదయగిరి అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు. మానసికంగా, శారీరకంగా అద్భుత ప్రయోజనాలు ఉన్న యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నదే యోగాంధ్ర కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని ఇన్‌ఛార్జీ కలెక్టర్ కార్తీక్ తెలిపారు.

## ట్యాక్స్ రివిజన్ సర్వేను ఈనెల 15 లోపు పూర్తి చేయండి కమిషనర్ వై.ఓ నందన్




**నెల్లూరు కార్పొరేషన్,జూన్ 10 ప్రభాతవార్త:** నగర పాలకసంస్థ పరిధిలో టాక్స్ రివిజన్ సర్వేకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని కమిషనర్ వై.ఓ నందన్ రెవెన్యూ అధికారులు, వార్డ్ అడ్మిన్ కార్యదర్శులకు సూచించారు. రెవెన్యూ సెక్షన్ వారాంతపు సమీక్షా సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ఉత్తర్వుల మేరకు ప్రతి అడ్మిన్ కార్యదర్శి సచివాలయ ఇతర కార్యదర్శులను సమన్వయం చేసుకుని ఇంటింటి ట్యాక్స్ రివిజన్ సర్వేను ఈనెల 15 వ తేదీ నాటికి వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. ప్రతిరోజు క్షేత్రస్థాయిలో ఉదయం 6 గంటల నుంచి రీ సర్వే ప్రారంభించి గృహాలకు సంబంధించిన అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేయాలని, నివేదికలను గూగుల్ షీట్స్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. సచివాలయాల మేరకు నిర్దేశించిన సర్వే రివిజన్ లక్ష్యాలను అడ్మిన్ కార్యదర్శుల ద్వారా పూర్తి చేయించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారు, విధులలో మెరుగైన పనితీరు కనబరచని వారు, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలలో అలసత్వం వహించిన కార్యదర్శులపై శాఖా పరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సూపరింటెండెంట్ నరేంద్ర, రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్‌లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

### - 3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు



**నెల్లూరు క్రైమ్, జూన్ 10, ప్రభాతవార్త:** తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు సోమవారం అర్ధరాత్రి గూడూరు రైల్వే స్టేషన్ లో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను నెల్లూరు రైల్వే డిఎస్పి జి మురళీధర్ మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు రైల్వే డిఐజి సత్య ఏసుబాబు ఆదేశాల మేరకు నెల్లూరు రైల్వే డిఎస్పి మురళీధర్ నేతృత్వంలో, జిఆర్‌పిసిఐఏ సుధాకర్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా నెల్లూరు రైల్వే సర్కిల్ పరిధిలోని పలు రైల్వే స్టేషన్లలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించే చర్యలో భాగంగా విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి ఎర్నాకులం వెళ్తున్న రైలు నుండి గూడూరులో దిగిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దేవదాస్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో అక్కడ తనిఖీలు చేపడుతున్న గూడూరు రైల్వే పోలీస్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద మూడు కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని చెన్నైకు బస్సు మార్గంలో తరలించేందుకే అతను ట్రైన్ దిగినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో అదుపులోకి తీసుకున్న నిందితుడని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ తనిఖీల్లో పాల్గొన్న గూడూరు, నెల్లూరు రైల్వే ఎస్సైలు చెన్నకేశవ, మాల కొండయ్య, ఆర్పిఎఫ్ ఏఎస్ఐ ఆర్ కె ఎన్ రావు, రైల్వే పోలీసులు రవి, వెంకటేశ్వర్లు, ఏ ఆర్ పి సి మణికంఠలను గుంతకల్లు, విజయవాడ రైల్వే ఎస్పీలు అభినందించినట్లు డిఎస్పీ తెలిపారు.

## మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డితో నల్లపరెడ్డి



**కోవూరు జూన్ 10 ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మో హన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లి లోనివారి నివాసంలో మా జీ మంత్రి రాష్ట్ర వైసీపీ అధికార ప్రతినిధి నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు నల్లపురెడ్డి రంజిత్ కుమార్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగాకలిశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ రెడ్డి ఇటీవల చేయికి చికిత్స చేయించుకున్న విషయం విధితమే ఈ సందర్భంగా ఆయన ప్రసన్నకుమార్ రెడ్డిని ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు అనం తరం జిల్లా రాజకీయ పరిస్థితిపై జిల్లాలో పార్టీ బలోపేతంపై ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా చర్చిం చుకున్నారు

## ఉపాధ్యాయులతో పాటు వైఎస్ఆర్సిపి చేసిన పోరాట ఫలితంగా ఎట్టకేలకు దిగివచ్చిన కూటమి ప్రభుత్వం

### - ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు,జూన్10 ప్రభాతవార్త - విద్య** ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రభు త్వం తీసుకువచ్చిన ఆన్ లైన్ కౌన్సిలింగ్ విధానంతో 50 వేల మంది ఎస్‌జిటిలు పడుతున్న ఇబ్బందుల పట్ల వైయస్ ఆర్సీపీ ముందుకొచ్చి అన్ని విధాల ప్రభుత్వం మీద ఒత్తిడి చేసి జరిపిన పోరాటం సత్ఫలితాన్నిచ్చింది. ఉపాధ్యాయులు, అందరూ కూడా ఏకతాటిపై నిలిచి సమిష్టిగా చేసిన పోరాట ఫలితంగా ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం దిగివచ్చి ఎస్‌జి టిలు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించేందుకు అంగీ కారం తెలిపింది. దీని మీద వైస్సార్సీపీ చేసిన పోరాటం అందరకీ తెలిసిందే. భవిష్య త్తులో ఉపాధ్యాయులు జరిపేపోరాటాల్లో ఉపాధ్యాయులకు వైఎస్ఆర్సి పి అండగానిలిచి, వారి సమస్యలను మాగొంతుగా చేసుకొని, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కార సాధనలో ఉపాధ్యాయులకు తోడుగా నిలుస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తెలియచేస్తున్నానన్నారు.

## భారీగా రెవెన్యూ శాఖలో బదిలీలు

### - 22 మంది తహసిల్దార్లు...

### - 36 మంది డిప్యూటీ తాసిల్దారులు.. - 42 సీనియర్ అసిస్టెంట్లు

**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 10, ప్రభాతవార్త** జిల్లాలో రెవిన్యూ శాఖకు సంబంధించి భారీగా బదిలీలు.. పదోన్నతులు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం.. జూన్ 9వ తేదీ అందుకు తుదిగడువుగా పేర్కొనడంతో ఈ మేరకు రెవిన్యూ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. ఇందులో భాగంగా 22 మంది తహసీల్దారుగా 11మందిరి సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, 36 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 42 మంది సీనియర్ అసిస్టెంట్లు, 4 మంది జూనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. ఇక 5 మంది సీనియర్ అసిస్టెంట్లు డిప్యూటీ తహసీల్దార్లుగా, 15 మంది జూనియర్ అసిస్టెంట్లు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు.

## వరుస కేసులతో కాకాణి ఉక్కిరిబిక్కిరి..!



**నెల్లూరు రూరల్, జూన్ 10, ప్రభాతవార్త** అక్రమ మైనింగ్ కేసులో ఏ4 ముద్దాయిగా మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ ఆర్సిపి అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి అరెస్ట్ 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం నెల్లూరు జిల్లా కోర్టులో పోలీస్ కస్టడీకి మూడు రోజులు నెల్లూరు రూరల్ డిఎస్పి ఆధ్వర్యంలో పలు ప్రశ్నలుకు ఎలాంటి సమాధానం లేకపోవడంతో పోలీస్ కస్టడీ పూర్తి కావడంతో గుంటూరు సిఐడి పోలీసుల అదుపులో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి ప్రతిష్టకు భంగం కలిగేలా సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడంపై వైఎస్ఆర్సిపి మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పై కేసు నమోదయింది. మాజీమంత్రి అంబటి రాంబాబు ఆయన్ని కలిసేందుకు గుంటూరు కోర్టుకు వచ్చారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పై మాఫింగ్ ఫోటోలతో సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు కాకాని గోవర్ధన్ రెడ్డి సోషల్ మీడియా నుండి అభ్యంతరమైన పోస్టు పెట్టారంటూ మేకల సురేంద్ర ఇచ్చిన కంప్లీట్‌ని ఆధారంగా తీసుకుని గుంటూరు సిఐడి పోలీసులు పిటి వారెంట్ అందించారు. మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని గుంటూరు కోర్టులో ప్రవేశపెట్టనున్న పోలీసులు ఈ కేసులో గుంటూరు కోర్టు 14 రోజులు డిమాండ్ విధించింది. ఆయన్ని గుంటూరు కోర్టు నుండి నెల్లూరు జిల్లా సెంట్రల్ జైలుకు తరలించారు. కోర్టులో ఆయన్ని పరామర్శించి వచ్చిన వైఎస్ఆర్సిపి మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని కోర్టుకు తీసుకొచ్చిన తీరు ఒక టెర్రరిస్ట్‌ని తీసుకువచ్చిన విధంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. కనీసం ఎవరిని ఆయన్ని కలిసెందుకు అనుమతిం చకుండా మిలటరీ రాజ్యాంగం నడుస్తున్నట్టు వ్యవహరిస్తున్నారు. కాకాణిపై గత శనివారం రాత్రి మరో రెండు కేసులు నమోదు చేసినట్టు సమాచారం.

## డీఆర్డీఏ ఉద్యోగుల బదిలీలు



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 10, ప్రభాతవార్త** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలను జరపాలన్న ఆదేశం మేర కు ఈ ప్రక్రియ పూర్తి చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి 4 ఏపీఎంలు 41 మంది సీసీలను ఈ సందర్భంగా బదిలీ చేసినట్టు డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజకుమారి తెలిపారు. ఒకే చోట ఐదు సంవత్సరాలుగా పని చేస్తున్న వారిని ఆ ప్రాంతంలోని బదిలీ చేయడంతో పాటు బదిలీలు కోరుకున్న వారిని కూడా ఇందులో భాగంగా బదిలీ చేశామన్నారు.

## జెడ్పీ సీఈవో విద్యారమ బదిలీ



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 10, ప్రభాతవార్త** జిల్లా పరిషత్ సీఈవో విద్యారమ బదిలీ అయ్యారు. విద్యారమను శ్రీ కాళహస్తి ఈటిసీ (ఎంప్లాయిస్ ట్రైనింగ్ కాలేజ్) ప్రిన్సిపాల్గా నియమించారు. డిప్యూటీ సీఈ వో మోహన్ రావును పూర్తి అదనపు బాధ్యతలతో నెల్లూరు జిల్లా జిల్లా పరిషత్ సీఈవోగా నియమించారు.

## 14న జిల్లాలో యోగా ప్రదర్శనలు

### - ఇన్‌ఛార్జీ కలెక్టర్ కార్తీక్



**నెల్లూరు, కలెక్టరేట్, జూన్ 10, ప్రభాతవార్త** ఈ నెల 14 వ తేదీన జిల్లాలో అన్ని చోట్ల యోగా ప్రదర్శన (డెమోనిస్ట్రేషన్) నిర్వహించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్‌లతో యోగాంధ్ర కార్యక్రమం పై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా నిర్వహించడానికి ప్రతి గ్రామంలో, వార్డు సచివాలయాలలో యోగా చేయ డానికి అను వుగా ఉన్న ప్రదేశాలను గుర్తించారన్నారు. ఆ ప్రదేశాలలో ఇప్పటినుండే ప్రతి రోజు మాస్టర్ ట్రైనర్లు, ఇతర శిక్షణ పొందిన ట్రైనర్లు యోగా నిర్వహించాలని సూచించారు. ఈ నెల 14న ప్రజలను భాగస్వాములను చేస్తూ జిల్లా వ్యాప్తంగా గుర్తించిన అన్ని ప్రదేశాలలో యోగా ప్రదర్శనలు నిర్వహించాలని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే జిల్లా ప్రధాన కేంద్రంలో పెద్ద ఎత్తున యోగా ప్రదర్శన నిర్వహించాలన్నారు.

## సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



**మనుబోలు జూన్ 10 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని పొదలకూరు డివిజన్ ఏడి ఈ సుబ్రమణ్యం పేర్కున్నారు.మంగళవారం ఆయన మనుబోలు సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతు పిఎం సూర్యఘర్ పథకం ద్వారా లబ్దిదారులు అనేక రాయితీలు పొందవచ్చునని విద్యుత్ చార్జీల భారం తగ్గుతుందని అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు మరో 20 వేల రూపాయల అదనపు రాయితీ సౌకర్యం కల్పిస్తుందని ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట లైన్ ఇనస్పెక్టర్ రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

## వికసిత కృషి సంకల్ప అభియాన్



**చేజర్ల జూన్ 10 ప్రభాతవార్త :** చేజర్ల రైతు సేవా కేంద్రంలో విససిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం మంగళవారం వ్యవసాయశాఖాధికారులు నిర్వహించారు.ఈ సందర్భంగా రాబోయే ఖరీప్ సీజనలో రైతులకు సంబందించి శాస్త్ర వేత్త ప్రసన్న లక్ష్మీ సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది.ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు సురేఖాదేవి, విజయకుమార్‌నాయక్,సుబారెడ్డి, వ్యవసాయ శాఖ మండలాధికారి శశిదర్, కూటమి నాయకులు టిడిపి మండల అద్యక్షులు షేక్ సిరాజుద్దీన్.తెలుగుదేశం నాయకులు రావి లక్ష్మీనరసారెడ్డి,బిజెపినాయకులు విజయ్ బాస్కర్‌రెడ్డి,బత్తలకృష్ణయ్య,సోమశిల దక్షణ కాలువ ప్రెసిడెంట్ రావి ప్రసాద్‌రెడ్డి రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

## అల్లరి మూకలపై చర్యలు తీసుకోండి



**మనుబోలు జూన్ 10 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఉన్న సాక్షి కార్యాలయంపై దాడి చేసిన అల్లరి మోకలపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాలు కోరాయి. ఈమేరకు మంగళవారం రాత్రి మనుబోలు సాక్షి విలేఖరి శ్రీదర్‌రెడ్డి ఆద్వర్యంలో స్దానిక విలేఖరులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతు సాక్షి చానల్ లైవ్‌లో ఒ విశ్లేషకుడు మాట్లాడిన మాటలను చానల్స్‌కి ఆపాదించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. పొరపాటున దొర్లిన తప్పుకు సదరు డిబేట్లో పాల్గోన్న అనలిస్టు,యాంకర్ ఇద్దరు క్షమాపణలు చెప్పినప్పటికి అల్లరి మూకలు సాక్షి కార్యాలయంపై దాడులు చేయడం అన్యాయం అని అన్నారు. దాడులకు పాలుపడ్డ వారిని చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జర్నలిస్టు సంఘం మనుబోలు మండలాద్యక్షులు జగదీష్‌బాబు ఉన్నారు.

## ఆంధ్రప్రదేశ్ సెక్స్‌వర్కర్లకు నిలయమైందని అనడం దారుణం..!

### మండిపడ్డ చాకలికొండ శారద



**కావలి, జూన్10 ప్రభాతవార్త :** అమరావతి దేవతల రాజధాని కాదని, ఆంధ్రప్రదేశ్ సెక్స్ వర్కర్లకు నిలయమైందని ప్రత్యక్ష ప్రసారంలో మహిళలను కించపరచడం అత్యంత దారుణమని ఉమెన్ ఫోర్స్ కన్వీనర్, వివిధ సంఘాల బాధ్యురాలు, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని చాకలికొండ శారద తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆమె మంగళవారం ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ మాట్లాడారు. ఇటీవల ప్రతివారికి మహిళలను కించపరచి మాట్లాడడం విపరీతమైందని దుయ్యబట్టారు. దళిత మైనర్ బాలికలపై అత్యాచార హత్యలను ఖండించి, నేరస్తులను కఠినంగా శిక్షించాలని సమైక్యగొంతుక వినిపించాల్సిందిపోయి ఆంధ్రప్రదేశ్ సెక్స్ వర్కర్లకు నిలయమైందని చెప్పడం అత్యంత గర్హనీయమన్నారు. తీవ్రస్థాయిలో ఖండిస్తున్నామన్నారు. కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులు మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఇటీవల హనుమత్‌జయంతి సందర్భంగా శంభునిపాలెం గుడివద్ద అసభ్య నగ్నప్రదర్శనలతో నృత్యాలు చేయించడంతో సమానమైన ఘోరమైన తప్పుఇది అని తెలిపారు. కొమ్మినేని శ్రీనివాసరావు ఈ చర్చను ఆపి అభ్యంతరం పెట్టకపోవడం దుర్మార్గమన్నారు. ప్రతి ఇంట్లో తల్లి, చెల్లి, భార్య, కూతురు వంటి ఏ రూపాలలోనైనా ఆడవాళ్లు ఉంటారని వీరికి తెలియదా... అని ఆమె ప్రశ్నించారు. సనాతనవాదులు ఇంద్రుడి రాజధాని అమరావతి అని అన్నంతమాత్రాన దానిని బలపరచి దేవతల రాజధాని అనాల్సిన అవసరం లేకున్నా, అమరావతి ఎవరికి నిలయంగా ఉందో తప్పుగా వ్యాఖ్యానించిన కృష్ణంరాజు తక్షణమే బహిరంగంగా మహిళలకు క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అసహ్యకర వ్యాఖ్యానాలను కొనసాగించిన కొమ్మినేని శ్రీనివాసరావుపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి అసంబద్ధ వ్యాఖ్యలకు చోటివ్వకుండా హెచ్చరింపు చర్యలు తీసుకోవాలన్నారు. అశ్లీల, అసభ్యకర నృత్యప్రదర్శనలు జరగనీయకుండా ఆంక్షలు విధించాలన్నారు. ఇటీవల అనంతపూర్‌లో దళిత మైనర్ బాలికను గ్యాంగ్‌రేప్ చేసిన రేపిస్టులను తక్షణం అరెస్ట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తాం

**ఆత్మకూరు, జూన్10,ప్రభాతవార్త:** ఆత్మకూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యతతో కూడిన మెరుగైన సేవలు అందిస్తామని ఆత్మకూరు ట్రాన్స్‌కో నూతన ఇఇ ఎం.భానునాయక్ తెలిపారు. ఆత్మకూరు ట్రాన్స్‌కో కార్యాలయంలో ఇఇగా మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన్ను కార్యాలయ ఉద్యోగులు , సిబ్బంది, యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు సబ్‌డివిజన్‌పరిధిలో లో ఓల్టేజ్ లేకుండా వినియోగదారులకు నిరంతరం సేవలందిస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సమస్యలను తమ దృష్టికి వచ్చిన వాటిని డివిజన్ పరిధిలోని ట్రాన్స్‌కో అధికారులతో సమావేశాలను నిర్వహించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విద్యుత్ శాఖాపరంగా క్షేత్ర స్థాయిలో ఏసమస్యలున్నా వినియోగదారులు తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. డివిజన్ పరిధిలోని ట్రాన్స్‌కో ఉద్యోగుల సహకారంతో , వినియోగదారులకు ఉత్తమమైన సేవలందిస్తామని బాను నాయక్ ఈసందర్భంగా పేర్కొన్నారు. విజయవాడ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఆత్మకూరు ఇఇగా బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావ్ పల్నాడు జిల్లా బాపట్లకు బదిలీ అయ్యారని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

## దగదర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆధార్ క్యాంపు



**దగదర్తి, జూన్ 10, ప్రభాతవార్త :** దగదర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐటీడీఏ(ఎస్టీ) కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఆధార్ సెంటర్ జరిగింది. కొత్తగా ఆధార్ కార్డు కావాల్సిన వారు, ఆధార్‌లో మార్పులు అధిక సంఖ్యలో ప్రజలు చేయించుకున్నారు. అంతే కాకుండా రేపు దగదర్తి సచివాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ఎవరైనా తెలియని వారు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

## తహసిల్దార్‌గా నయీం అహ్మద్



**వలేటివారిపాలెం జూన్ 10, ప్రభాతవార్త :** వలేటివారిపాలెం తహసిల్దార్‌గా నయీం అహ్మద్‌ని నియమించారు. ఈయన గతంలో కందుకూరులో డీటీగానూ, ఒ ంగోలు,చీమకుర్తి,పుల్లలచెరువు తదితర మండలాల్లో తహసిల్దార్‌గా పనిచేశారు.తాజాగా సెలవులో ఉన్నారు. సెలవుల అనంతరం ఇటీవల ప్రభుత్వం నియమించిన బదిలీల్లో నయీం అహ్మద్‌ను వలేటివారిపాలెంకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.ఈ నేపధ్యంలో నయీం బుధవారం పదవీ బాద్యతలు చేపట్టనున్నారు.ఇక్కడి పనిచేస్తున్న తహసిల్దార్ శ్రీనివాసరావును కేవలం నెలలోపే బదిలీ చేశారు.గత నెలలో ఈయన ప్రమోషన్‌పై అడ్‌హాక్ తహసిల్దార్‌గా ఇక్కడ చేరారు.తాజా బదిలీల్లో ఈయన ను కొండపికి ట్రాన్స్ ఫర్ అయ్యారు. ఈ నేపధ్యంలో నయీం బధువారం విధుల్లో చేరనున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు సన్న బియ్యం పంపిణీ : ఎంఈఓ



**ఉదయగిరి, జూన్ 10, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వం వారు సరఫరా చేసిన సన్నబియ్యం అని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేయడం జరిగిందిన ఉదయగిరి మండల విద్యాశాఖాధికారి-1 షేక్ మస్తాన్ వలి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేసిందని ఈనెల 12వ తేదీ పాఠశాలలు పున:ప్రారంభం అయినప్పటి నుండి విద్యార్థులకు ప్రతి రోజు సన్న బియ్యంతో కూడిన అన్నం, ప్రతి రోజు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన మెనూ ప్రకారం రుచి శుచికరంగా నాణ్యంగా కూరలు తయారు చేసి విద్యార్థులకు అందించాలని మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు తెలియజేశారు.

## అరాచకాలు కేరాఫ్ అడ్రస్ కూటమి ప్రభుత్వం



**నెల్లూరు రూరల్, జూన్ 10, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం రోజులు గడిచినప్పటికీ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో ఈ కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందడాన్ని నిరసిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈరోజు నెల్లూరు నగరంలోని విఆర్సి సెంటర్ వద్ద గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్రంలో జరిగే ఈ అఘాయిత్యాలను నివారించేలా, మహిళల మీద అఘాయిత్యాలకు పాల్పడుతున్న తెలుగుదేశం పార్టీకి చెందిన సైకోలను కఠినంగా శిక్షించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకి, హోం మంత్రి అనితకి మంచి బుద్ధి ప్రసాదించమని కోరుతూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని బాలికలు, విద్యార్థినులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు నిరసనగా ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం తరపున ఆందోళన చేపట్టాం. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో మహిళల పట్ల, మైనర్ బాలికల పట్ల రోజురోజుకు అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. ఈ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగనన్ని నేరాలు ఘోరాలు ఈ రాష్ట్రంలో మైనర్ బాలికలపై జరుగుతున్నాయి. ఈ అఘాయిత్యాలు నివారించాలని, ఈ అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు మహనీయుడు బాబాసాహెబ్ అంబేద్కర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు, మహిళ గౌరీ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో అలివికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంవత్సరం గడిచినప్పటికీ హామీలు అమలు చేయకుండా మోసం చేస్తుంది. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీలను ఏ మాత్రం పట్టించుకోకుండా మహిళలను నిలువునా మోసం చేసింది. హామీలను అమలు చేయకపోగా రాష్ట్రంలో మహిళల మీద అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయి. ఆడపిల్లల్ని కన్న ప్రతి తల్లిదండ్రులు బిడ్డ బయటికి వెళ్ళిన సమయం నుండి తిరిగి వచ్చేవరకు ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు చూస్తున్న తల్లిదండ్రులకు నిద్ర పట్టడం లేదు. రాష్ట్రంలో పట్ట పగలు కూడా మహిళలు బయట తిరిగే స్వేచ్ఛ లేకుండా అఘాయిత్యాలు, అరాచకాలు జరుగుతుంటే ఈ కూటమి ప్రభుత్వం అవేవీ పట్టించుకోకుండా రాజకీయ కక్ష సాధింపు దృష్టి సారించింది.

## తహసిల్దారుకు డీలర్ల సంఘంతో ఘన సన్మానం

**కోవూరు జూన్ 10 ప్రభాతవార్త :** కోవూరు తహసిల్దారుగా ప్రస్తుతం పని చేస్తున్న నిర్మలానందబాబా పదోన్నతిపై ఆర్‌డిఒ కార్యాలయం ఏఓగా బదలీ అయిన సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి కోవూరు మండలం చౌక డిపో డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా కోవూరు తహసిల్దారు వారి కార్యాలయంలో డిప్యూటి తహసిల్దారుగా పనిచేస్తున్న నాజర్ ఎలక్షన్ డిప్యూటి తాహసిల్దారు రవికుమార్ సీనియర్ అసిస్టెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ సుధా ,జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌ను కూడా ఈ సందర్భంగా డీలర్లు సంఘం ఆద్వర్యంలో శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చౌకడిపో డీలర్ల అసోసియేషన్ నేతలు మల్లికార్జునరావు, ఎస్‌కె కుద్దూస్‌బాషా,వై కోటిలింగాలు, శ్రీనివాసులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాతత్పరత కలిగిన మనస్తత్వం బాలకృష్ణది





**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త-వైద్యం :** సినీ రంగంలో రాజకీయాల్లో మకుటం లేని మహారాజు నందమూరి బాలకృష్ణ అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. పద్మభూషణ్ నందమూరి నటసింహం బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్లో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన బాలకృష్ణ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సిటీ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. జై బాలయ్య.. జై శీనయ్య అంటూ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి ముఖ్య నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ నటించిన చిత్రాలలో సీన్లను ప్రదర్శించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఏ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన దాన్ని విజయవంతం చేయడంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాత్ర కీలకం అన్నారు. విజయవాడ వెళ్లాల్సిన తనను పట్టుబట్టి బాలయ్య జన్మదిన వేడుకలకు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రతి ఏడాదిలాగా ఈ సారి కూడా బాలయ్య పుట్టిన రోజు వేడుకలు అంబరాన్ని అంటాయన్నారు. బాలకృష్ణ అభిమానులకు తోడుగా నీడగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఉన్నారని అభినందించారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నాయకత్వం భవిష్యత్తు తరాలకు అవసరమన్నారు. స్వర్గీయ ఎన్టీ రామారావుతో సీఎం చంద్రబాబు, నందమూరి బాలకృష్ణతో కలిసి పని చేయడం తన అదృష్టమని ఆనం వ్యాఖ్యానించారు. పద్మభూషణ్ అవార్డు తీసుకున్న తరువాత జరుగుతున్న వేడుకలు కావడంతో ఎంతో ప్రత్యేకంగా శ్రీనివాసులురెడ్డి వేడుకలు నిర్వహిస్తున్నారని వివరించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి మాట్లాడుతూ నాలోని బాధను, భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని నింపే ఏకైక వ్యక్తి నందమూరి బాలకృష్ణ అన్నారు. రాజకీయంగా తాను ఎన్నో ఇబ్బందులను వడిదుడుకులను.. బాలకృష్ణ సాన్నిహిత్యంతో ధైర్యంగా ఎదుర్కొన్నానన్నారు. తల్లి ఆశయాలను, తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తున్న వ్యక్తి బాలకృష్ణ అంటూ ఆయన కొనియాడారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి నెల్లూరు జిల్లా నుంచి ఎంతో మంది అభాగ్యులను పంపించానని, వారందరికి ప్రాణం పోసిన గొప్ప వ్యక్తి బాలకృష్ణ అని అన్నారు. తనకి నుడా చైర్మన్ పదవి రావడానికి సీఎం చంద్రబాబు, లోకేష్ మంత్రులతో పాటు బాలకృష్ణ కుడా ప్రధాన కారణం అన్నారు. ఆయన రుణం తీర్చుకోలేనిదని కోటంరెడ్డి వ్యాఖ్యానించారు. ఐలవ్ నెల్లూరు అని నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. బాలకృష్ణ సిద్దాంతాలను ప్రతి ఒక్కరికి చేరవేసేందుకు సైనికుడిలా పోరాడతానని స్పష్టం చేశారు. అనంతరం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ మాట్లాడుతూ కోటంరెడ్డి సూచనలతో తన ఎన్నికల ప్రచారానికి బాలకృష్ణ వచ్చారని ఆయన గుర్తు చేశారు. బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నేతల ఆశీస్సులతో తాను గెలిచానని గుర్తు చేశారు. కోటంరెడ్డి కుటుంబానికి, బాలకృష్ణకి విడదీయరాని బంధం ఉందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ యువ హీరోలకి రోల్ మోడల్‌గా భవిష్యత్తు రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడిగా సేవ రంగంలో మనసున్న మారాజులాగా బాలకృష్ణ చరిత్రలో నిలిచిపోతారని వారు కొనియాడారు. ఈ జన్మదిన వేడుకలలో కోటంరెడ్డి సంధ్యతో పాటు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్, బోదాటి రాదయ్య, బాలకృష్ణ అభిమాన సంఘం నేత రవి, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కోటేశ్వరస్వామి వారి రావణాసేవ ఉత్సవం



**సంగం జూన్ 10 ప్రభాతవార్త :** సంగం మండలం దువ్వూరు గ్రామంలో జరుగుతున్న కోటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారు రావణాసేవ ఉత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించారు. గ్రామోత్సవంలో భక్తులు స్వామి వారిని తిలికించి భక్తితో నైవేద్యాలు సమర్పించారు. పెద్ద ఎత్తున బాణా సంచిని కాలుస్తు స్వామి వారి ఉత్స వం కన్నుల పండుగగా సాగింది.

## అన్ని తరాలు మెచ్చిన హీరో బాలయ్య బాబు



**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త - వైద్యం :** నెల్లూరులో కోటంరెడ్డి శీనన్న ఆధ్వర్యంలో నిర్వహించిన బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. నా చిన్నతనంలో బాలకృష్ణ నటించిన ఆదిత్య 369, భైరవద్వీపం సినిమాలు చూశాను. కాలేజీ రోజుల్లో సమరసింహారెడ్డి, నరసింహనాయుడు సూపర్ హిట్టు. నా కుమారుడు వచ్చే సరికి అఖండ, డాకు మహరాజ్ హైలెట్. ఓ రోజు అఖండ సినిమాకు వెళ్లొచ్చిన నా కుమారుడు త్రిశూలంతో వచ్చాడు.. డాకు మహరాజ్ చూసొచ్చి గుర్రం కావాలని కోరాడు. నటనతో అన్ని తరాల వారిని మెప్పించిన ఘనత ఒక్క బాలయ్య బాబుకే దక్కుతుందన్నారు. అప్పుడే పుట్టిన పిల్లలు కూడా జై బాలయ్య అంటున్నారు. అది ఆయన సత్తా రాజకీయాల్లో హ్యాట్రిక్ ఎమ్మెల్యే అన్నారు. సేవా కార్యక్రమాల్లోనూ ఆయనది పెద్దమనసు, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా వేలాది మందికి వైద్య సేవలందిస్తున్నారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో బాలయ్య నిండు నూరేళ్లు వర్ధిల్లాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను. నెల్లూరు జిల్లాలో కోటంరెడ్డి శివన్న రూపంలో మనకు జూనియర్ బాలయ్య అందుబాటులో ఉన్నారని చెప్పడానికి చాలా సంతోషంగా ఉందని సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

## ముస్లింలు తీవ్రవాదులు కారు- ఏఐఎస్ఎస్సీ నేత అహ్మద్ భాషా



**ఉదయగిరి, జూన్ 10, ప్రభాతవార్త :** మత విద్వేషాలను రెచ్చగొడుతూ, తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతూ ఇస్లాం ధర్మాలను అనుసరించని వారు ముస్లింలే కారని ఆల్ ఇండియా సూఫీ సజ్జదానషీన్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అహ్మద్ భాషా ఖాలిది అభిప్రాయపడ్డారు. మంగళవారం ఉదయగిరిలోని ఆస్థాన ఖాదరి యాలో గ్రామ ప్రజలు, శిషయలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అహ్మద్ భాషా మాట్లాడుతూ ఏఐఎస్సీసీ రాజస్థాన్‌లోని అజ్మీర్ కేంద్రంగా పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ఇటీవల తనను ఆంధ్ర రాష్ట్రం తరుపున ప్రతినిధిగా ఎన్నుకొని జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారన్నారు. ఇస్లాం శాంతిని, పరమత సహనాన్ని కోరుకుంటుందని, సమస్త జీవరాశుల పట్ల దయకలిగి ఉండాలని భోదిస్తుందన్నారు. ప్రవక్త మహమ్మద్ అనుసరించిన మార్గంలో నడవమని, మాతృభూమి భారతదేశాన్ని ప్రేమించాలని ఇస్లాం ఆదేశమన్నారు. ఈ సందర్భంగా తీవ్ర వాదాన్ని వ్యతిరేకిస్తూ పహల్గాం దురాగతాన్ని ఆయన ఖండించారు. ముస్లింలు తీవ్ర వాదులు కారని, తీవ్ర వాదం వైపు నడిచేవారు ముసిలనంలే కాదన్నారు. ఆత్మకూరు, సీతారాంపురం, పోరుమామిళ్ల, అనంతపురం నుంచి ఆయన శిష్యులు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొని అహ్మద్ భాషాను ఘనంగా సన్మానించారు. ఉదయగిరి ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ అజీజ్, సీనియర్ జర్నలిస్టు ఉదయగిరి ఫయాజ్, పూర్వ మండల విద్యాశాఖాధికారి అల్లాబక్షు, ఉదయగిరి జిల్లా సాధన కమిటీ అధ్యక్షులు వేణుగోపాల్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు దస్తగిరి అహ్మద్, పూర్వ ఆంగ్ల అధ్యాపకులు మహబూబ్ మస్తాన్, స్థానిక ఎంపీటీసీ ఎస్దాని మస్తాని తదితరులు పాల్గొన్నారు.

## వింజమూరులో మహిళాగ్రహం




**వింజమూరు, జూన్ 10, ప్రభాతవార్త :** అమరావతి ప్రాంతం మహిళలను అవమాన పరిచిన సాక్షి ఛానల్‌ను బహిష్కరించాలని బేషరతుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతిరెడ్డి మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వింజమూరులో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై అసభ్యకరంగా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి చేటు అని మహిళలపై అసహ్యకరంగా ప్రచారం చేసిన సాక్షి ఛానల్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వింజమూరు మండలం నారీమణులు నడుం బిగించి బంగ్లా సెంటర్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం స్థానిక బంగ్లా సెంటర్ నుండి కొత్త బస్టాండ్ సెంటర్ వరకు సాక్షి ఛానల్‌కు, ప్రతినిధులకు, వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ స్వచ్ఛందంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, తన ప్రసంగంలో దేవతల రాజధాని అమరావతి అని మాట్లాడటం జీర్ణించుకోలేని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోద్భలంతో ఆయన సతీమణి వైఎస్ భారతీరెడ్డి, సాక్షి ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావు, జర్నలిస్టు కృష్ణంరాజు పర్యవేక్షణలో డిబేట్ ఏర్పాటు చేసిన, మహిళా లోకాన్ని కించపరిచే విధంగా వేశ్యల రాజధాని అమరావతి అని సంబోధించడం, దానికి కొమ్మినేని శ్రీనివాసరావు మద్దతు పలకడం, వారి సైకోతనానికి పరాకాష్ట అని అన్నారు. ఇప్పటికే ప్రతినిధిని అరెస్టు చేసినప్పటికి, జర్నలిస్టు కృష్ణంరాజును కూడా అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు పేర్కొన్నారు. మహిళలను కించపరిచే విధంగా ప్రచారం చేసిన సాక్షి ఛానెల్‌ను వెంటనే రద్దు చేసి మూసివేయాలన్నారు. మహిళ అంటే ఆదిశక్తి అని, అందరికి తల్లి అని, అలాంటి మహిళలను అవమానపరిచిన వారికి మద్దతు పలికిన వారిని కూడా శిక్షించాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి బేషరతుగా మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలను అవమానపరిచిన వారిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కఠినంగా వ్యవహరించాలని, ప్రభుత్వానికి మహిళలు మద్దతుగా ఉంటారని, మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా శిక్షలు పడే విధంగా చూడాలని, మహిళల హక్కులను కాపాడాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల మహిళా మణులు స్వచ్ఛందంగా పాల్గొని తమ డిమాండ్లను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకురాలు మంద సుజాత, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర మహిళా నాయకురాలు నూతలపాడు జయలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యురాలు ఏకశిరి భవాని, అల్లూరు వాణి, మహిళా లోకం తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ



**వింజమూరు, జూన్ 10, ప్రభాతవార్త :** ప్రముఖ సినీ కథానాయకుడు హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదినోత్సవ వేడుకలను వింజమూరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణ అభిమాన సంఘ అధ్యక్షులు షేక్ షరీఫ్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అదే విధంగా స్థానిక సీహెచ్‌సీ వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలయ్య శత వసంతాలు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళ వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూపల్లి రాజారావు, గూడా నర్సారెడ్డి, చేబ్రోలు వసంతరావు, తిరుపతి ఆచారి, కొండపల్లి వెంకటేశ్వర నాయుడు, జనాపురం కృష్ణ, గోసు మహేష్ యాదవ్, భోజనపు ఆనంద్, బాలకృష్ణ, బాలయ్య, అభిమాన సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

## కప్పరాళ్ళతిప్పలో కాటన్ సెర్చ్




**బిట్రగుంట జూన్ 10 ప్రభాతవార్త :** బోగోలు మండలం కప్పరాళ్ళతిప్ప లో మంగళవారం ఉదయం జిల్లా ఎస్పి ఆదేశానుసారం కావలి డిఎస్పి శ్రీధర్ ఆధ్వర్యంలో కాటన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానస్పద వ్యక్తుల ఇళ్లను సోదచేశారు. కాలనీలను జల్లెడ పట్టారు. ఈ సోదాలలో ఎలాంటి పత్రాలు లేని 32మోటార్ సైకిళ్ళు, 3ఆటోలను స్వాధీనం చేసుకొన్నారు. అనంతరం పలువురికి నేరప్రవృత్తికి దూరంగా ఉండాలని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కావలి రూరల్, వన్ టౌన్ సీఐలు రాజేశ్వరరావు, ఫిరోజ్ లతో పాటు బిట్రగుంట, కావలి రూరల్, వన్ టౌన్, దగదర్తి, జలదంకి ఎస్సైలు, 60 మంది పోలీస్ కానిస్టేబుళ్ళు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు మంచి పద్ధతి కాదు



**కోవూరు, జూన్ 10ప్రభాతవార్త :** అమరావతి రాజధాని పరిసర ప్రాంతాలు వేశ్యల రాజధాని అని సాక్షి డిబెట్ ఛానెల్‌లో చెప్పడం మహిళల మనోభావాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, కోవూరు పురవీధుల్లో మంగళవారం మహిళలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ కేవలం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆ చానెల్‌లో ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేయడంతో మహిళల మనోభాలు తవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. మహిళలు పెద్ద ఎత్తున నిరసన చేస్తున్నా యాజమాన్యంలో ఎటువంటి స్పందన లేకపోవడం దారుణమన్నారు. ఇకనైనా మహిళల పట్ల ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే వారికి మరలా బుద్ధి చెప్పే రోజు దగ్గరలో ఉందన్నారు. స్థానిక మందబయలు సెంటర్ నుంచి ప్రధాన రహదారి మీదుగా కోవూరు తాలూకా ప్రాంగణం వరకు నిరసన ర్యాలీ చేరుకుంది. ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని ఆ చానెల్‌ను, పేపర్‌ను మూసివేయాలంటూ పెద్ద ఎత్తున ప్లకార్డులు చేబూని నిరసన వ్యక్తం చేశారు.

## బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



**తోటపల్లిగూడూరు, జూన్ 10, ప్రభాతవార్త** సమాజంలో బాల్య వివాహాలు చాలా ప్రమాదకరమని అలా బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులను వాఇంచి పిల్లలకు మంచి చదువులు నేర్పించే విధంగా ప్రజా సంఘాలు ఉపాధ్యాయులు రాజకీయ నాయకులు అందరూ కలిసి కట్టుగా ఆడ పిల్లలకు చిన్న వయసులోనే వివాహాలు జరిపించే అవగాహన కల్పించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని నరుకూరు ఎంపీటీసీ రఘుబాబు పిలుపునిచ్చారు. మంగళవారం నరుకూరులోని అంగన్‌వాడీ స్కూల్లో కిశోర వికాసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా నరుకూరు ఎంపీటీసీ రఘుబాబు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహం వల్ల సమాజానికి చేటని, అలాగే బాల్య వివాహాలు చేసుకునే ఆడ పిల్లలు త్వరగా అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయన గుర్తు చేశారు. ఆడ పిల్లలు 18 సంవత్సరాలు నిండే అంత వరకు చదివించాల్సిన బాధ్యత పిల్లలు తల్లిదండ్రులపై సమాజంపై ఉందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కిశోర వికాసం కార్యక్రమం చేపట్టిందని వేసవి కాలంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు అందరూ పాల్గొని మంచి విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేయాలని ఆయన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నరుకూరు సర్పంచ్ శారద సీడీపీఓ నలుగురు నాయకులు అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## శంకర నేత్రాలయం కంటి శస్త్ర చికిత్సలు ప్రారంభం




**వింజమూరు, జూన్ 10, ప్రభాత వార్త** వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాలలో శేగు సుబ్బారావు, నిర్మలాదేవి, ఎన్ఆర్ఐ శేగు సతీష్ దాతృత్వంలో జూన్ 6వతేదీ నిర్వహిస్తున్న శంకర నేత్రా లయం, చెన్నై వారి ఉచిత కంటి వైద్య శిబిరంలో భాగంగా నేడు మంగళవారం ఐదవ రోజున అవసరమైన రోగులకు కంటి శస్త్ర చికిత్సలు మొబైల్ ఆపరేషన్ థియేటర్స్ వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా చెన్నై నుండి వచ్చిన శంకర నేత్రాలయం ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ గజేంద్ర కుమార్ వర్మ మాట్లాడుతూ శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో అధునాతన పరికరాలతో కూడిన మొబైల్ ఆపరేషన్ థియేటర్లలో దేశా వ్యాప్తంగా దాదాపు 3500 కంటి శస్త్ర చికిత్సలు ఉచితంగా సంవత్సరానికి చేస్తున్నామని, దానిలో భాగంగా నేడు వింజమూరులో శంకర్ నేత్రాలయం కంటి వైద్య శిబిరాలను నిర్వ హిస్తున్నామని తెలియజేశారు. ఈ రోజు వింజమూరులో మొబైల్ ఆపరేషన్ థియేటర్స్‌లో 27 మంది రోగులకు కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేయడం జరిగిందని డాక్టర్ వర్మ తెలియజేశారు. శంకర నేత్రాలయం ప్రజా సంబంధాల అధికారి రంజిత్ కుమార్ మాట్లాడుతూ వింజమూరులో జూన్ 6వ తేద ప్రా రంభమై ఈ కంటి వైద్య శిబిరంలో నేటి వరకు 600 మంది కంటి పరీక్షలు చేసుకొనగా 95 మందికి శస్త్ర చికిత్సలు చేయలేనటువంటి రోగులను చెన్నైలోని శంకర నేత్రాలయానికి తీసుకువెళ్లి అక్కడ కూడా ఉచితం గానే శస్త్రచికిత్సలు చేస్తామని తెలియజేశారు. ఈ రోజు నిర్వహించిన పూజా కార్యక్రమంలో వింజమూరు ఎంపీటీసీ వనిపెంట హైమావతి, వనిపెంట సుబ్బారెడ్డి, నిర్వాహకులు యల్లాల రఘురామిరెడ్డి, పలుకూరు వెంగయ్య, మందాడి శ్రీనివాసరెడ్డి, తిరుపాలు, చలమయ్య, కందల మధు, కొండారెడ్డి, తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, డాక్టర్ యల్లాల అనిల్ కుమార్‌రెడ్డి, డాక్టర్ యల్లాల శ్రీనిధి మొదలగు వారు పాల్గొనడం జరిగింది.

## గృహ నిర్మాణాల విషయంలో ఇకనైనా అలసత్వం విడనాడాలి



**కోవూరు, జూన్ 10ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వ గృహాలు నిర్మించుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్దిదారుల నిర్మాణాలు మరింత వేగవంతం అయ్యేలా సంబంధిత సచివాలయ , ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్ అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సచివాలయ పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల గృహ నిర్మాణాలు చేసుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్దిదారులకు నిర్మాణ వ్యయం పెంచిన నేపథ్యంలో సంబంధిత లబ్దిదారుల్లో నిర్మాణాలు వేగవంతం అవడమే కాకుండా సకాలంలో పూర్తయ్యేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. విధి నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహించే ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అదేవిధంగా ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ వారి వారి పరిధిలో పర్యటించి ఎప్పటికప్పుడు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ వెంకటేశ్వర్లురెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## పశు అంబులెన్స్ సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, జూన్ 10ప్రభాతవార్త :** కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చి మండలాలకు సంబంధించిన పశు వైద్యసేవలు అందుబాటులో లేని గ్రామాల్లో జూన్ నెలంతా పశు అంబులెన్స్ సేవలు ప్రతి రోజూ రెండు గ్రామాల్లో పర్యటించేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య తెలిపారు. స్థానిక శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ జూన్ నెల 10వ తేది నుంచి 30 వరకు ఈ నాలుగు మండలాల పరిధిలో ప్రతి రోజూ ఉదయం ఒక గ్రామం, మధ్యాహ్నం ఒక గ్రామం ఈ పశు అంబులెన్స్ సందర్శిస్తుందని, ఆయా గ్రామాల్లో ఉన్న పాడి రైతులు ఈ పశు అంబులెన్స్ సేవలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. ఈ నెల 11వ తేది విడవలూరు మండలానికి సంబంధించి కంచరపాలెం, పెద్దపాలెం, 12వ తేది గోల్కొండాయతోపు, తుమ్మగుంట గ్రామాల్లో పర్యటిస్తుందని, ఆయా గ్రామాల్లోని పాడి రైతులు ఈ పశు అంబు లెన్స్‌లు ఉచిత వైద్య సేవలతో పాటు మందులు కూడా అందజేయడం జరుగుతుందని దీనిని దృష్టిలో పెట్టు కుని ఆయా గ్రామాల్లోని పాడి రైతులు అంబులెన్స్ సేవలను పొందాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



## వైభవంగా పల్లకి సేవ



కోవూరు, జూన్ 10ప్రభాతవార్త : కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వేకువజామునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా తమ్మినేని రవికుమార్, అరుణమ్మ దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో చేవూరు కృష్ణప్రసాద్, బ్రహ్మోత్సవ నిర్మాణ కర్తలు మొలకల శ్రీనివాసులురెడ్డి, గాదిరాజు చక్రవర్తి, హరి, భక్తులు ఉన్నారు.

## ఉపాధి హామీ పనిని పటిష్ఠం చేయాలి



**కావలిరూరల్, జూన్10 ప్రభాతవార్త** ఉపాధిహామీ పనిని మరింత పటిష్ఠం చేసి ఉపాధిహామీ కూలీలకు కేంద్ర, రాష్ట్రప్ర భుత్వాలు అండగా ఉండాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్రకమిటీసభ్యులు టి.మాల్యాద్రి తెలియచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం పిలుపుమేరకు ఉపాధి హామీపని మరింత పటిష్ఠం చేయాలని కావలి మండల వ్యవసాయకార్మికసంఘం ఆధ్వర్యంలో మంగళవారం కావలి ఎంపిడిఓ చేవూరు శ్రీదేవికి వినతిపత్రం అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా టి.మాల్యాద్రి మాట్లాడారు. ఉపాధిహామీ పనికి కేంద్రప్రభుత్వం 2 లక్షల 50 వేలకోట్ల రూపాయలు కేటాయించాలని కోరారు. సంవత్సరానికి 200ల రోజులు పనిదినాలు కల్పించాలని, రోజువారీ కూలీ 600 రూపాయలు ఇవ్వాలని కోరారు. వేసవికాలంలో మజ్జిగ, మంచినీళ్ల ఇవ్వాలని, టెంట్లు ఏర్పాటుచేయాలని కోరారు. పేస్లిప్స్ ఇచ్చి వారంవారం వేతనం ఇవ్వాలని తెలియచేశారు. చాలా గ్రామాలలో అన్ని తరగతులవారికి పనిసరిగా కేటాయించడం లేదని తక్షణం పనికేటాయించాలని కోరారు. పట్టణంలో ఉన్నవారికి ఉపాధిహామీ పనిని ప్రవేశపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కావలి మండల వ్యవసాయ కార్మికసంఘం అధ్యక్షులు పి.సీతారామయ్య, కార్యదర్శి ఎం.రాధాకృష్ణయ్య, కె.జాన్, ఆర్.సీతారామసింగ్, ఎన్.నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమం



**ముత్తుకూరు, జూన్ 10, ప్రభాతవార్త** ముత్తుకూరు మండలంలోని నారికేళ్ళపల్లి పంచాయితీలోని సుబ్బారెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుబ్బమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి తోటివారితో కుటుంబ సభ్యులు, సంఘ సభ్యులతో పంచుకోవాల న్నారు. బాలికల విద్య, వారి హక్కులు సాధించుకోవడానికి సమాజంలో ఈ సమాచారాన్ని ఇతరులకు చేరవేయడానికి సోషల్ మీడియా ప్లాట్ ఫారంలను ఉపయోగించండి, బాల్య వివాహాలను నిరోధించడంలో విద్య యొక్క ప్రాధాన్యత, వారి విద్యను కొనసాగించడానికి తోటి వారిని ప్రోత్సాహించండి, మద్దతు ఇవ్వాలని ఒకరినొకరు విద్యా పరంగా విజయవంతం కావడానికి స్టడీ గ్రూప్ ఏర్పాటు చేసుకుని కలిసి చదువుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ జి. మాధవీలత, ఆయా, గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

## టెన్సింగ్ నార్గే జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 10, ప్రభాతవార్త** కేంద్ర, రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ వారు 2024 సంవత్సరానికి టెన్సింగ్ నార్గే జాతీయ సాహస అవార్డు కోసం 2022, 2023, 2024 సంవత్సరాలలో భూమి, నీరు (సముద్రం), వాయు (గాలి) వాటిపై చేసిన సాహస కార్యకలాపాల్లో (1) అత్యుత్తమ విజయాలు సాధించిన వారి నుండి మరియు (2) సాహస కార్యకలాపాల్లో నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తులకు జీవిత సాఫల్యం సాధించిన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డుల కోసం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పై అంశాలలో అత్యుత్తమైన విజయాలు సాధించిన అభ్యర్థులు ఆన్లైన్ పోర్టల్ హెచ్‌టిటిపిఎస్://అవార్డ్స్.జిఓవి.ఇన్ ద్వారా మాత్రమే నామినేషన్లు 3.06.2025లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## తెలుగును పాలనాభాషగా పటిష్ఠంగా అమలుచేయాలి



**కావలిరూరల్, జూన్10 ప్రభాతవార్త** తెలుగుభాషను పాలనాభాషగా పటిష్ఠంగా అమలుచేయాలని లోక్‌సత్తా ఉద్యమసంస్థ సమన్వయ కమిటి సభ్యులు ఎం. మాలకొండారెడ్డి రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వపాలనా కార్యక్రమాలన్నీ తెలుగులోనే నిర్వహించాల న్నారు. ప్రాథమిక విద్యను మాతృభాషలో కనీసం 30శాతం అభ్యసించుకుంటే అది మాతృభాషగా మారుతుందని యునెస్కో హెచ్చరించిందన్నారు. జిల్లాలో అధి ,కారభాష శాఖల ఏర్పాటుచేసి తీరుతెన్నులపై పరిశీలించాలని కోరారు. రచయితలు, కవులు,కళాకారు లు, మేథావులు నిరంతరం తెలుగుభాషకు వన్నెతెచ్చేవిధంగా కృషి చేయాలన్నారు. వ్యవహారిక భాషాపితామహులు గిడుగు రామ్మూర్తి పంతులును స్ఫూర్తిగా తీసుకుని భాషా పరిరక్షణకు రాష్ట్రతెలుగు అధికారభాషాసంఘం ప్రత్యేకమైన చర్యలు తీసుకుని నిరంతరం కృషి చేయాలని కోరారు.

## బాల్యవివాహాలపై అవగాహన



దగదర్తి, జూన్ 10, ప్రభాతవార్త మండలంలోని పెదపుత్తేడు -3 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జే.వాణి బాలికలకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహలు చేయడం చట్ట రీత్య నేరం అని అన్నారు. ఆడ పిల్లలకు బాల్య వివాహాలు చేయటం వలన అనారోగ్యాలు పాలవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ టీచర్స్ లోఈ్మ కాంతమ్మ, వెంకటరమణమ్మ, మమత, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం



కోవూరు, జూన్ 10ప్రభాతవార్త : పెళ్లీడు వయస్సు రాకుండానే వివాహాలు చేయడం వలన భవిష్యత్తులో బాలికలు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని పెళ్లీడు వయస్సు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల తెలిపారు. కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వేగూరు కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తే చట్టప్రకారం వారు శిక్షార్హులు అవుతారన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శి కార్యకర్త ఎం. శైలజ మాట్లాడుతూ బాలికలు తప్పనిసరిగా చదువుకోవాలని, మధ్యలో చదువు ఆపకుండా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. సమాజంలో విద్యకు ఎనలేని ప్రాధాన్యత ఉందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శైలమ్మ, కిశోర బాలికలకు పలు సూచనలు చేశారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త కె. రాజ్యలక్ష్మి, వెంకటరమణమ్మ, కిశోర బాలికలు, తల్లులు ఉన్నారు.

## ఎమ్మార్పీఎస్ జెండా రెపరెపలాడాలి




**వింజమూరు, జూన్ 10, ప్రభాతవార్త** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ ఇతర అనుబంధ సంఘాల నేతలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు జిల్లా ఇన్‌ఛార్జీ మంద వెంకటేశ్వరరావు మాదిగ పేర్కొన్నారు. మంగళవారం వింజమూరులోని స్థానిక వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో ఉదయగిరి నియోజకవర్గ స్థాయి, సమీక్షా సమావేశం ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పందిటి అంబేద్కర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి ముఖ్య అతిధులుగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు జిల్లా ఇన్‌ఛార్జీ మంద వెంకటేశ్వరరావు మాదిగ పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభమై జులై 7 నాటికి 30 సంవత్సరాలు పూర్తి చేసుకుని 31వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా ప్రతి గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జాతీయ జెండా దిమ్మెలను ఏర్పాటు చేసి గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా రెపరెపలాడేలా చేయాలని కోరారు. జులై 7వ తేదీన ప్రారంభించాలని అందరికి దిశానిర్దేశం చేశారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ కాగడాలని వెలిగించి మహోన్నత శక్తిగా వెలుగుతూ భారతదేశంలోని మాదిగ కులాల వైపు అందరి చూపు ఉండేలా చేసిన పోరాట ఫలితంగా మహాజన నేత మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం యావత్ మాదిగ జాతికి దక్కిన గౌరవమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఉదయ్ కృష్ణ మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, వడ్లపల్లి కిష్టయ్య మాదిగ, బెజవాడ బాల గురవయ్య మాదిగ, గొల్లపల్లి మోహన్‌రావు మాదిగ, గంగపట్ల సింహాద్రి మాదిగ, గోచిపాతల ఆనంద్‌రావు మాదిగ, నందిపోగు వెంగళరావు మాదిగ, గోసాల సుధాకర్ మాదిగ, తాతపూడి మోసే మాదిగ, గొల్లపల్లి వెంకటేష్ మాదిగ, మొలబంటి సుధాకర్ మాదిగ, గంగపట్ల సురేష్ మాదిగ, ఎం.పెచలయ్య, జి.చిన్న పెంచలయ్య, కే.పెంచల రావు మాదిగ,వై.బాబు మాదిగ, జి.మురళి, జి.మధు, వి.రత్నం మాదిగ, డి.మస్తాన్, వి.తిరుపతి, ఇతర మండలాల నాయకులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలలో ముగిసిన కిషోర వికాసం



**జలదంకి, జూన్10, ప్రభాతవార్తః** కౌమారదశలో వున్న బాలికల సమగ్ర అభివృద్ధి,సాదికారితకై ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిషోర వికాసం కార్యక్రమం మంగళ వారంతో ముగిశా యి.మే 2 నుం చి మండలంలోనిఅంగ న్‌వాడి కేంద్రాలలో 12అం శాలకు సంబందించి కిషోర బా లికలకు అవగాహన కల్పించారు.ప్రతి మంగళ, శుక్రవారా లలో పలు కార్యక్రమాలు నిర్వహించి ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు,అంగన్‌వాడి టీచర్లు కార్యక్రమాన్ని విజ యవంతం చేశారు.చివరిరోజు బ్రాహ్మణక్రాక సెక్టర్ పరిధిలోని చామదల,జలదంకి సెక్టార్‌కు సంబందించి జలదంకిలో కార్యక్రమాలు చేపట్టారు.రెండు గ్రామాలలోని బిసి అంగన్‌వాడికేంద్రాలలో జరిగిన వికాసంలో సూపర్‌వైజర్లు అరుణ,హైమావతిలు పాల్గొని బాల్యవివాహాలు వాటివల్ల కలిగే అనర్దాలపై కూలకుషంగ వివరించి బాలికల్ని చైతన్యపరచారు.తల్లులకు కూడా పూర్తి అవగాహన కల్పించారు.చిన్న వయస్సులో వివాహాలు చేసినందున శారీరక,మానసిక సమస్యలు ఏర్పడతాయని వివరించారు.వీటి నివారణకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టి తల్లిదండ్రులలోమార్పు తీసుకొచ్చిందన్నారు.ప్రతి ఆడబిడ్డ చదవాలి తద్వార వారి జీవితాలను కాంతివంతం చేసుకోవాలని అన్నారు.నేడు అన్ని రంగాలలో బాలికలు ఎంతో పరిణితి చెంది ఉన్నతశిఖరాలకు ఎదుగుతున్నారని కావున వారిలో వున్న ప్రజ్ఞను ప్రతి తల్లి,దండ్రులు గర్తించి వారికి పూర్తి స్వేఛ్ఛనివ్వాల్సి వుందన్నారు.ఈకార్యక్రమంలో కిషోర బాలికలతోపాటు తల్లులు వర్కర్లు కళ్యాణి,సిహెచ్ వసంత విజయలక్ష్మి,శీత,తిరుమల,ఎం విజయ,సరిత,పద్మ ,సౌజన్య,ప్రమీ ల,ఆశావర్కర్లు,పాల్గొన్నారు.

## మహిళలపట్ల అనుచితంగా ప్రవర్తించినవారిని కఠినంగా శిక్షించాలి

### కావలిలో కదంతొక్కిన టిడిపి కూటమి పార్టీల మహిళలు




**కావలి, జూన్10 ప్రభాతవార్త** మహిళలపట్ల అనుచితంగా ప్రవర్తించినవారిని కఠినంగా శిక్షించాలని, సాక్షి టి.వి ఛానల్ మూసివేయాలని కావలి టిడిపి కూటమి పార్టీల మహిళలు, మహిళాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. సాక్షి ఛానల్‌లో మహిళలపై అసభ్యకరంగా మాట్లాడడాన్ని నిరసిస్తూ మంగళవారం కావలిలో టిడిపి కూటమి పార్టీల మహిళలు, మహిళాసం ఘాల నేతలు కదంతొక్కి, నిరసనలు వ్యక్తం చేశారు. కావలి పట్టణంలోని సెల్ఫీపాయింట్ నుంచి మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన నినాదాల ప్రదర్శన సాగింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్ర మంలో తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, కావలి పట్టణ టిడిపి మహిళా అధ్యక్షురాలు అర్షియాబేగం, టిడిపి మహిళానేత పద్మావతి శ్రీదేవిలు మాట్లాడారు. మహిళలపట్ల అనుచిత వ్యాఖ్యలు తగదన్నారు. మహిళలు ఆగ్రహిస్తే తట్టుకోలేరని తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేశారు. మహిళలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. ఇ లాంటి పరిస్థితి మళ్లీ పునరావృతమైతే ఇబ్బందులు పడతారని తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేశారు. ఈ నిరస్ న కార్యక్రమంలో టిడిపి నేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు భారీగా తరలివచ్చి నిరసనలు వ్యక్తం చేశారు.

## మహిళా చట్టాలపై కిశోర బాలికలు అవగాహన కల్గివుండాలి



రాపూరు, జూన్10ప్రభాతవార్త మహిళా రక్షణ చట్టాలపై కిశోర బాలికలు అవగాహన కల్గివుండాలని రాపూరు యంపీడీఓ మారెళ్ళ భవనీ కోరారు. మంగళవారం మండల సమావేశ మందిరంలో ఐసిఎస్ సిడిపిఓ సునంధ ఆధ్యక్షతన నిర్వహించిన కిశోర వికాసము వేసవి శిక్షణా కార్యక్రమాల ముగింపు సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాలికలు రక్తహీనతకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళా చట్టాలు, బాల్య వివాహల నివారణా, బాలికా విద్య ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత ఏ విదంగా పాటించాలి అన్న విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ లక్ష్మీ నరసింహం, రాపూరు సొసైటీ మాజీ ఆధ్యక్షుడు చెన్ను బాస్కర రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు వున్నారు. అకలితో అలమటించిన కిశోర బాలికలు కిశోర వికాస వేసవి శిక్షన ముగింపు కార్యక్రమం సందర్బంగా రాపూరు మండల పరిషత్ సమావేశ మందిరానికి ఉదయం 11 గంటలకు పలువురు 11 నుండి 18 సంవత్సరాల లోపు కిశోర బాలికలను సమావేశానికి ఐసిడిఎస్ అధికారులు తీసుకువచ్చారు. కార్యక్రమం మద్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించారు. అయితే సమావేశానికి తీసుకువచ్చిన బాలికలకు మద్యాహ్నం 2 అవుతున్న బోజనాలు పెట్టకపోవడంతో వారు అకలితో అలమటించారు. సభ అనంతరం బాలికలు అకలితో తిరిగి ఇళ్ళకు వెల్లి బోజనాలు చేశారు. కార్యక్రమాలు జరిపినట్లు చెప్పుకునేందుకు ఇటువంటి సభలు నిర్వహించే అధికారులు వారికి, బోజన సదుపాయం కూడా కల్పించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాలికలు మంచి ఆహారం తీసుకోవాలి, ఆరోగ్యంగా వుండాలని ఈ ముగింపు శిక్షణలో ఊపదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన అధికారులు సమయానికి వారికి ఆహారం పెట్టకుండా వారిని ఇబ్బందులు పెట్టడం ఎందుకన్న విమర్శలు వినవస్తున్నాయి.

## ఊరికి పెద్ద బడి వచ్చింది

- చేరువైన ఉన్నత విద్య - నియోజకవర్గంలో 9 ఉన్నత పాఠశాలలు ఏర్పాటు




**కోవూరు, జూన్ 10ప్రభాతవార్త :** గతంలో రాష్ట్రాన్ని పరిపాలించిన వైసీపీ విద్యారంగంలో ఆశించిన మేర మార్పులు తీసుకుని రాకపోవడంతో ఈ కారణంగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యను సరైన మార్గంలో పెట్టేందుకు చర్యలు చేపట్టింది. కోవూరు నియోజకవర్గంలో మొత్తం 9 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా పదోన్నతి కల్పించింది. దీంతో తమ ఊరికి పెద్ద బడి వచ్చిందని విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో యూపీ పాఠశాలలను ఉన్నత విద్యాలయాలుగా ఉన్నతి కల్పించింది. గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో 60 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉంటే వాటిని ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కోవూరు నియోజకవర్గ పరిధిలోని కొడవలూరు మండలంలో 1 ప్రాథమికోన్నత పాఠశాల, విడవలూరు మండలంలో 2, కోవూరు మండలంలో పడుగుపాడు, పోతిరెడ్డిపాలెం, ఇందుకూరుపేట మండలంలో 3 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా పదోన్నతి కల్పించారు. ఈ కారణంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు కానున్న ఈ ఉన్నత పాఠశాలలకు ప్రతి తరగతికి బోధించేందుకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను ఏర్పాటు చేశారు. విద్యార్థినులు తమ గ్రామంలో హైస్కూల్ లేదనే కారణంగా బడికి మానేయడం వంటి చర్యలు లేకుండా పదవ తరగతి వరకు ఆయా గ్రామాల్లోనే ఉచిత విద్య అందించేలా ఏర్పాటు కూడా చేపట్టారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు వారికి కావాల్సిన విద్య కిట్లను కూడా ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుంది. దీనికి తోడు మధ్యాహ్నం భోజనంతో పాటు విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కూడా కల్పించేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని ఎంఈవో రహీమ్ తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నంది సేవలో మల్లికార్జున స్వామి

**కోవూరు, జూన్ 10ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. మంగళవారం స్వామివారు నందివాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఆర్యవైశ్య సంఘం వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి చేవూరు కృష్ణప్రసాద్, రుత్వికులు , భక్తులు ఉన్నారు. ఈ సందర్భంగా స్వామివారు నందవాహన సేవలో కోవూరు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

## నేడు కోవూరులో ఎమ్మెల్యేచే శంకుస్థాపనలు



**కోవూరు, జూన్ 10ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కోవూరులోని ఇనమడుగు సెంటర్‌లో 3.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీచ్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అదేవిధంగా కోవూరులోని పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో 1.48 కోట్ల వ్యయంతో శంకుస్థాపన, అనంతరం భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ జలజీవన్ మిషన్ 12.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## ఏపిఈఎంసిఎల్ చైర్మన్ పోలంరెడ్డిని సత్కరించిన గునుకల



**నెల్లూరు,జూన్10 ప్రభాతవార్త-విద్య :** రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డిని మంగళవారం జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోర్ కమిటీ సభ్యులు గునుకుల కిషోర్ నగరంలోని పోలంరెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా గునుకుల పోలంరెడ్డిని శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించారు.చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించటగం పట్ల గనుకుల పోలంరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వ్యర్థాల నుండి సంపదన సృష్టించటం, పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు , ప్రజలను బాగస్వాములను చేయటం వంటి వాటిపై ఇరువురు చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, నగర కార్యదర్శి జోన్నల గడ్డ హేమచంద్ర, నగర సంయుక్త కార్యదర్శి పసుపులేటి శరవణ, 51వ డివిజన్ ఉపాధ్యక్షులు ఇంగిలాల మౌనిష్ తదితరులు పాల్గొన్నారు.

## హమంతసేవ ఉత్సవంలో ఆత్మారామస్వామివారు



**సంగం జూన్ 10 ప్రభాతవార్త :** సంగం మండలం అన్నారెడ్డిపాళెంగ్రామంలో శ్రీ సీతాలక్ష్మణ సమేత ఆత్మారామస్వామి వారి సన్నిధిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారు హనుమంతసేవ ఉత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని వివిధ రకాల పూలతో అత్యంత సుందరంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా గున్నంరెడ్డి మీనమ్మ స్పెసిఫిక్ ఎండోమెంట్,ఇందుపూరు రాఘవరెడ్డి అండ్ బ్రదర్స్, మంగలపూడి బ్రదర్స్ వ్యవహారించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు వేదగిరి సత్యనారాయాణ చార్యులు, భరత్ స్వామి నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఇఒ చిల్లకూరు వరప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

## రక్షణ ప్రమాణాలు కలిని వాహనాలను ప్రజలు ఆదరించాలి

- ఎంవిఐ బాలమురళీకృష్ణ వెల్లడి




**నెల్లూరు,జూన్10 ప్రభాతవార్త - విద్య :** రక్షణ ప్రమాణాలు అధికంగా కలిగిన వాహనాలను ప్రజలు ఆదరించాలని, అందరూ వాహన దారులు విధిగా రోడ్డు నియమాలు పాటించాలని మెటార్‌వెహికల్ ఇన్స్పెక్టర్ బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక శివశంకర్ మెటార్స్ టాటాషోరూంలో న్యూ ఆల్ట్రోజ్ వాహన ఆవిష్కరణలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతు ఈ వాహనాన్ని ఆవిష్కరించటం సంతోషంగా ఉందన్నారు. అన్నీ వాహనాలకు వాహనదారులు విధిగా సర్వీసులు చేయించుకోవాలని పేర్కొన్నారు.నిర్వాహకులు మాట్లాడుతు ఈ నూతన వాహనం డీజిల్ , పెట్రోల్, సిఎన్‌జిఅన్నీ వేకరియంట్స్‌లో లబిస్తుందని, అలాగే ఉత్తమమైన సర్వీసును అందిస్తామన్నారు. అందరూ తమను ఆదరించాలని వారు కోరారు. జెడ్ఎం జయదీప్‌గుప్త, ఆర్ఎం గోపు, టెరిటరీ మేనేజర్ శ్రావన్, ఎండి రవి, జిఎం మురళీ, మేనేజర్స్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## కాకాని పై టార్గెట్ ఎవరిది ..?

-



కేసులతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న కాకాని - మరో 14 రోజులు డిమాండ్

**నెల్లూరు రూరల్, జూన్ 10, ప్రభాతవార్త :** మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి రోజురోజుకు కేసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అయితే ఈ కేసులపై నెల్లూరు జిల్లా సర్వేపల్లి ప్రజలు మనసుల్లో రకరకాల ప్రశ్నలు లేవనిస్తున్నాయి. ప్రభుత్వానికి మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి టార్గెట్ అయ్యారా..? పోలీసులు వరస కేసులు నమోదు చేయడం వెనక ఏం జరుగుతుంది..? సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కాకానికి మధ్య ఉన్న వ్యక్తిగత వైరమా లేక.. ప్రభుత్వ జోక్యమా..? కాకాని కోసం కొత్త కేసులు కూడా ఎదురుచూస్తున్నాయా..? నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని కొత్త పాత కేసులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒకదాని తర్వాత ఒకటి ఆయన్ని వెంటాడుతున్నాయి. ఇప్పటికే పొదలకూరు మండలం రుస్తుం మైన్స్‌లో క్వార్జి అక్రమ రవాణా జరిగిందన్న అభియోగాల నేపథ్యంలో ఆయన నెల్లూరు జిల్లా సెంట్రల్ జైల్లో ఉన్నారు. బెయిల్ పై ఆయన తరపు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేసిన సమయంలోనే.. గుంటూరు సిఐడి అధికారులు ఆయన పిటి వారింట్ పై అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలించారు. సోషల్ మీడియాలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి పై మార్ఫింగ్ పోస్ట్ లు పెట్టారంటూ ఆయనపై కేసు నమోదు అవ్వడంతో ఈ కేసులో 14 రోజులు పాటు కోర్టు రిమాండ్ విధించింది. ఈ కేసుల్లో రిమాండ్‌లో ఉన్న కాకాని గోవర్ధన్ రెడ్డి పై జిల్లా పోలీసులు వరుసగా కేసులు నమోదు చేస్తూనే ఉన్నారు. కృష్ణపట్నం పోర్టు సమీపంలో అనధికారికంగా టోల్గేట్ ఏర్పాటు చేసి కంటైనర్ల నుంచి నగదు వసూలు చేశారనే అభియోగాల నేపథ్యంలో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డితో పాటు ఆయన ప్రధాన అనుచరుడు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి పై ముత్తుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దాంతోపాటు కనుపూరు చెరువులో అక్రమంగా గ్రావెల్ను రవాణా చేసేందుకు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఆరోపణ నేపథ్యంలో సిట్ ఈ కేసును దర్యాప్తు చేస్తుంది. ఇందులో కూడా కాకాని గోవర్ధన్ రెడ్డి పేరు చేర్చారు. ప్రస్తుతం ఈ మూడు కేసులు యాక్టివ్‌లో ఉన్నాయి. ఈ కేసుల్లో ఒకదాని తర్వాత ఒకటి పీటి వారెంట్ వేసి కాకాని విచారించేందుకు పోలీసులు పోటీ పడుతున్నారు. ఆయన రిమాండ్ కూడా ముగియడంతో జిల్లా జడ్జి మరో 14 రోజులు పాటు రిమాండ్ పొడిగించారు. ఈ కేసులు కాకుండా మరిన్ని పాత కేసులు తిరిగి తోడేందుకు పోలీసుల సన్నద్ధమవుతున్నారు. కాకానికి ఇప్పట్లో బెయిల్ వచ్చే అవకాశం లేదని పోలీసు వర్గాలు పేర్కొంటున్న నేపథ్యంలో జిల్లా వైసీపీలో కలవరం మొదలైంది. రాజకీయ ఒత్తిళ్లతోనే కాకాని గోవర్ధన్ రెడ్డి పై అక్రమ కేసులు నమోదు చేయడం పాత కేసులను యాక్టివ్ చెయ్యడం జరుగుతుందని వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంకటాచలం పోలీస్ స్టేషన్లో నమోదైన గ్రావెల్ కేసులో సిట్ అధికారులు కాకాని గోవర్ధన్ రెడ్డిని కస్టడీకి కోరుతూ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అది త్వరలోనే విచారణకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అధికారంలో ఉన్నప్పుడు.. ప్రతిపక్ష సమయంలో కూడా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్న కాకానిని ప్రభుత్వం టార్గెట్ చేసిందన్న ప్రచారం జిల్లాలో జరుగుతుంది. ఈ కేసుల వ్యవహారంపై సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూడా స్పందించారు. అధికారంలో ఉన్న సమయంలో కాకాని చేసిన పాపాలే ఇప్పుడు శాపాలుగా మారాయని.. దేవుడు ఉన్నాడంటూ ఆయన వ్యాఖ్యానించారు. మొత్తంగా కాకాని గోవర్ధన్ రెడ్డిని పోలీసులు ప్రభుత్వం ముప్పు తిప్పలు పెడుతుంది. అని జిల్లా ప్రజలు అనుకుంటున్నారు. మరికొందరు టిడిపి నాయకులు మాత్రం వైసిపి అధికారంలో ఉన్నన్ని రోజులు అక్రమ కేసులతో టిడిపి నాయకులను వేధించి హింసించిన విధానం గుర్తొస్తుందన్నారు. ఆయన చేసిన తప్పులు అవినీతి ప్రతిఫలంగానే ఆయన్ని ఈ స్థితికి రావాల్సి వచ్చిందని వాపోతున్నారు. ఏది ఏమైనా రాబోయే రోజుల్లో ఈ కేసులు ఏమనుకు తిరుగుతాయో వేచి చూడాలి.

## అనుమతులు అతిక్రమించిన నిర్మాణాలకు నోటీసులు జారీ చేయండి



**నెల్లూరు కార్పొరేషన్,జూన్ 10 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం మంజూరు చేసిన అనుమతులను అతిక్రమించి చేపట్టిన నిర్మాణాలకు నోటీసు లను జారీచేసి చార్జిషీట్లు ఫైల్ చేయాలని కమిషనర్ వై.ఓ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 33వ డివిజన్ నేతాజీ నగర్ పరిసర ప్రాంతాలలో కమిషనర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో భవనాల నిర్మాణాలకు కొలతలు వేసి అసెస్మెంట్ డిమాండ్ లతో సరిపోల్చి చూసారు. అనుమతులు లేని, అక్రమ భవన నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి నిర్మాణ పనులను ఆపివేయాలని వార్డు ప్లానింగ్ కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. భవన నిర్మాణ సామాగ్రి రోడ్లను, వీధులను ఆక్రమిస్తూ డంపు చేయకుండా నిరంతరం పర్యవేక్షించాలని, అతిక్రమించిన వారికి జరిమానాలు విధించాలని ఆదేశించారు. అన్ని డివిజనుల్లో రోడ్డు ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని, రోడ్లను ఆక్రమిస్తూ చేపట్టిన నిర్మాణాలను తప్పనిసరిగా తొలగించి వేస్తామని కమిషనర్ హెచ్చరించారు.అనంతరం ఫతేఖాన్ పేట ప్రాంతంలో జరుగుతున్న డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను,స్థానిక బందెల దొడ్డి ప్రాంతం ఉన్న స్థలాన్ని కమిషనర్ పరిశీలించి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని సూచించారు. ఏసీ కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ అవాంతరాలు తలెత్తకుండా రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం వైఎంసిఏ గ్రౌండ్స్ సమీపంలోని రజక భవన్ ప్రాంగణాన్ని కమిషనర్ పరిశీలించారు. సమీపంలోని అన్న క్యాంటీన్ కమిషనర్ సందర్శించే ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. క్యాంటీన్ పరిసర ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

## స్వర్ణాంధ్ర 2047విజన్ యాక్షన్‌ప్లాన్‌పై సమీక్షా సమావేశం నేడే



**ఆత్మకూరు, జూన్10,ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్ ను సమర్ధవంతంగా అమలు లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు, నియోజకవర్గ పరిధిలలోని పార్టీ ప్రతినిధులతో సమీక్షాసమీక్షా సమావేశాన్ని బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఉదయం 11గంటలకు దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని మంత్రి క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.ఈసమావేశంలో శాఖల వారీగా ప్రాధాన్యత కలిగినఅంశాలు, అభివృద్ధి ప్రణాళికలు, అమలు చేయాల్సిన కార్యాచరణ పట్ల చర్చ జరుగుతుందని, కావున నియోజకవర్గంలోని తహసిల్దార్లు, మండల పరిషత్ అధికారులు, మున్సిపల్ కమీషనర్ , ఇతర శాఖలకు చెందిన అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు , ఎన్‌డిఎ కూటమి నాయకులు, తెలుగుదేశం, జనసేన , బిజెపి మండల అధ్యక్షులు అందరూ ఈసమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని వారు కోరారు.

## మంచినీటి కొరత లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**ఇందుకూరుపేట, జూన్ 10, ప్రభాతవార్త :** ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. మండలంలోని గంగపట్నం కాలువ మూలవ కండ్రిగ గ్రామానికి జల జీవన్ మిషన్ నిధులు 38 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిల పైప్‌లైన్ మంగళవారం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. అనంతరం గంగపట్నం గ్రామంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా వేకువన జరిగే చాముండేశ్వరి దేవి కళ్యాణానికి పట్టు వస్త్రములు సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులతో ప్రతి గ్రామంలో మంచినీటి కొరత లేకుండా చేస్తామని ఆమె తెలిపారు. చాముండేశ్వరి దేవి తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్ర నాయుడు, పొన్నెబోయిన చెంచు కిషోర్ యాదవ్, కొండూరు సుధాకర్‌రెడ్డి, గుండాల కృష్ణారెడ్డి, అవ్వారు ఏడుకొండలు, బొద్దుకూరు సుధీర్, బొద్దుకూరు సుధాకర్, దొడ్ల మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్పొరేషన్ వద్ద ధర్నా

- మున్సిపల్ మేయర్ కమిషనర్లకు సమ్మె నోటీసు అందచేత.



**నెల్లూరు కార్పొరేషన్,జూన్ 10 ప్రభాతవార్త:** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచల నరసయ్య, నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 17 రోజుల్లో సమ్మె సందర్భంగా ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచేదానికి 9 మంది ఐఏఎస్ అధికారులతో కమిటీ వేసి స్కిల్, సెమిస్కిల్ జీతాలు చెల్లిస్తామని, 60 సంవత్సరాలు వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచుతామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పిస్తామని, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం అవుతాయని కార్మికులు ఎంతో ఆశతో ఎదురు చూశారని వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం రోజులు కావస్తున్న ఇంతవరకు ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. నెల్లూరు కార్పొరేషన్ లో 93 మంది కార్మికులను అర్ధాంతరంగా నిలిపివేశారని వారికి ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదని చెప్పారు. అంతేకాకుండా నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో క్యాజువల్ సెలవులు అమలు జరగడం లేదని , యూనిఫామ్, నూనె, చెప్పులు, బ్లౌజులు, మాస్కులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అనేకమంది మున్సిపల్ కార్మికులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని ఇబ్బందులు పడుతున్నారు. వారికి బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులు కేవలం 15000 రూపాయలతో జీవనం గడపడం కష్టంగా మారింది. అందువలన ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. చెత్త ట్రాక్టర్ల పేర్లతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న కార్పొరేషన్, మున్సిపల్ కార్మికులకు కనీస సదుపాయాలు కల్పించడంలో విఫలమవుతున్నదని ఆరోపించారు. కావున మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మె లోకి పోయే దానికి సిద్ధపడతామని తెలిపారు. అనంతరం కార్పొరేషన్ మేయర్ , కమిషనర్ సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండా ప్రసాద్, శివాజీ, కృష్ణమూర్తి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, సునీల్, దేశ మూర్తి, లోకేష్, వజ్రమ్మ, భారతి, మారుతి, చంద్రమ్మ, ఇంజనీరింగ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ వేదింపులతో మహిళ ఆత్మహత్యాయత్నం



**చేజర్ల జూన్ 10 ప్రభాతవార్త :** చేజర్ల మండలం ఆదూరుపల్లి గ్రామంలో ఎస్ఐ వేదింపుల కారణంగా సోమవారం రాత్రి ఒ మహిళ ఆత్మహత్యాయత్నానికి ఓడి కట్టింది.బాధితురాలి కధనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన షేక్ మగ్బుల్‌జాన్ అనే ముస్లీం మహిళ ఇంటి విషయంలో చేజర్ల ఎస్ఐ తనను వేదిస్తున్నారంటు పురుగుల మందు త్రాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆదూరుపల్లిలోని ఒ ఇంటికి సంబందించి ఆత్మకూరు జూనియర్ సివిల్ కోర్టులో గత ఏడాది పదో వ నెలలో టెంపరవరీ ఇంజక్షన్ ఆర్డర్ పొంది వున్నట్లు బాధితురాలు మగ్బుల్‌జాన్ తెలిపింది.అయినప్పటికి స్దానిక ఎస్ఐ ఇంజక్షన్ ఆర్డర్‌ని బేఖాతరు చేస్తు ప్రత్యేర్దులకు వత్తాసు పలుకుతు తనను వేదిస్తున్నట్లు వాపోయింది. అంతే కాకుండా తనను పలు సార్లు పోలీస్ స్టేషన్‌కి పిలిపించి వేదించడంతోపాటు తనపైన అక్రమ కేసు బనాయించినట్లు తెలిపింది. ఈనేపద్యంలో ప్రత్యర్దులు ఆఇంటిలోకి ప్రవేశించేందుకు గత రాత్రి ఎస్ఐ మద్దతు తెలపడంతో మనస్దాపానికి గురైన మహిళ గత రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాలుపడినట్లు సమాచారం.పురుగుల మందు త్రాగి పడిపోయిన మహిళను బంధువులు 108 సహాయంతో పొదలకూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రాధమిక చికిత్స అందించి అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.నెల్లూరులో బాధిత మహిళ ఐసియులో చికిత్స పొందుతుంది. చేజర్ల ఎస్ఐతోపాటు ప్రత్యర్దులు కొంతమంది వేదించడం వల్ల తాను ఆత్మహత్యకు పాలు పడ్డానని స్టేట్‌మెంట్‌లో పేర్కున్నట్లు తెలిసింది.

## జాతీయ భద్రతా సలహాబోర్డు ఎన్ఎస్ఎబి సభ్యుడిగా సతీష్‌రెడ్డి



**ఆత్మకూరు, జూన్10,ప్రభాతవార్త:** కేంద్రంలో అత్యంత కీలకమైన జాతీయ భద్రతా సలహాబోర్డు సభ్యుడిగా డిఆర్‌డిఒ మాజీ చైర్మెన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక సలహా మండలి సభ్యులు గుండ్రా సతీష్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ పదవిలో ఆయన రెండుసంవత్సరాలపాటు కొనసాగనున్నారు. రా మాజీ చీఫ్ అలోక్ జోషి నేతృత్వంలో జాతీయ భద్రతా సలహాబోర్డును ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రధాని నేతృత్వంలో ఉన్న జాతీయ భద్రతా కౌన్సిల్‌కు ఈ బోర్డు పలు సూచనలు చేయనుంది . ఎంతో ప్రతిష్టాత్మకమైన, కీలకమైన జాతీయ భద్రతా సలహాబోర్డును ఇటీవలే కేంద్ర ప్రభుత్వం పునర వ్యవస్థీకరించడం గమనార్హం. బోర్డులో 7గురు సభ్యులకు గాను ఆరుమందిని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నియమించింది. బోర్డులో సభ్యులుగా మాజీ వెస్టన్‌ఎయిర్ కమాండర్ ఎయిర్‌మార్షల్ పిఎం సిన్హా, ఆర్మీ సథరన్ మాజీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఎ.కె.సింగ్, రియర్ అడ్మిరల్ మోంటీ ఖన్నా, విశ్రాంత ఐపిఎస్ అధికారులు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్‌సింగ్ మాజీ విదేశాంగ శాఖ అధికారి బి.వెంకటేష్‌వర్మలను నియమించిన బోర్డు సభ్యుడిగా రక్షణ రంగ నిపుణులు డిఆర్‌డిఒ మాజీ చైర్మెన్ సతీష్‌రెడ్డికి స్థానం కల్పించినందుకు ఆయన స్వగ్రామమైన ఆత్మకూరు మండలం మహిమలూరు, ఆత్మకూరు నియోజకవర్గం, నెల్లూరు జిల్లాలో పార్టీలకు అతీతంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## జిల్లా లో నేడు అన్ని నియోజక వర్గాలలో ప్రారంభోత్సవాలు



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 10, ప్రభాతవార్త :** ఈ నెల 11 వ తేదీ బుధవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరుగు తాయని జిల్లా ఇంచార్జి కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 3 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరుగుతాయని, కొన్ని నియోజకవర్గాలలో ఇంకా ఎక్కువ పనులకు ప్రాంభోత్సవాలు జరుగుతాయని, స్థానిక శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులు వీటిని చేస్తారన్నారు. మంజూరైన పనులకు శంకుస్థాపనలు ఆయా నియోజకవర్గ శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులు చేస్తారన్నారు. నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని కార్తీక్ కోరారు.

## తెలియని వ్యక్తి మృతి

**నెల్లూరు క్రైమ్, జూన్ 10, ప్రభాతవార్త :** స్థానిక బోడిగాడి తోట ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి సుమారు 40 ఏళ్ళ వయసు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## భార్యపై అలిగి భర్త ఆత్మహత్య

**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త :** భార్య పుట్టింటికి వెళ్ళిందని మనస్థాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్థానిక భగత్ సింగ్ కాలనీ మంగళవారం సమీపంలో చోటుచేసుకుంది. జమీర్ (37), మమోల దంపతులు భగత్ సింగ్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదం ఏర్పడడంతో అలిగిన భార్య మమోల సోమవారం తన పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన జమీర్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారి సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న నవాబుపేట సీఐ వేణుగోపాల్ రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## అసత్య ప్రచారాలు తగవు

**ఇందుకూరుపేట, జూన్ 10, ప్రభాతవార్త :** తమపై కొందరు పనిగట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తూ మా పరువుకు భంగం కలిగిస్తున్నారని కొత్తూరు గ్రామ వాసి షేక్ వహీదా ఆమె కుమార్తె షేక్ జాస్విన్ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 14 సంవత్సరాల క్రితమే తనకు తన భర్తకు విడాకులు అయిపోయాయని తాను ఉంటున్న ఇల్లు తను కొనుగోలు చేశానని అయితే కొందరు పనిగట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తూ తమ పరువుకు భంగం కలిగిస్తున్నారన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలు తగదని హితవు పలికారు. గతంలో భర్త తరుపు కుటుంబీకులు తనపై తన కుమార్తెపై దాడి చేశారని, మళ్లీ ఇప్పుడు కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో కక్ష సాధింపు చర్యగా తమపై దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇటువంటి ప్రచారాలు మళ్లీ పునరావృతం అయితే తాము కోర్టుని ఆశ్రయిస్తామన్నారు.